

# గుడ్ల రహస్యం

## చిన్నారి పాఠకులకు ప్రకృతి కథలు

విద్యా రాజారాం శర్మ

అనువాదం : కె. సురేష్

## ఇతర కథలు:

రట్టు కాని గుట్టు

గుజ్జన గూళ్లు

రకరకాల పక్షులు

గూళ్లు కట్టేవి, ఆక్రమించేవి

“చూడు గుడ్లు ... ఎర్రజుట్టు తీతువ గుడ్లు!”

నక్కుతూ వెళ్లిపోతున్న ఒక గోధుమరంగు పిట్ట వెనక్కి తిరిగి “ఎవరు ఆ మాటలు అన్నది?” అని కోపంగా అడిగింది.

“నేనే,” ఒక్క క్షణం బిత్తరపోయి, నంగిరిగా బదులిచ్చాను.

“అలాగని ఎందుకనుకుంటున్నావ్?” ఆ పిట్ట ఇంకా కోపంగానే అడిగింది.

“అనుకోవడం కాదు, నాకు తెలుసు,” నేను బదులిచ్చాను.





“అంత ఖచ్చితంగా తెలుసా?”

ఒక పిట్ట నన్ను ఇంతగా సవాలు చెయ్యటం కష్టంగా అనిపించింది. మైదానంగుండా వెళుతుండగా అనుకోకుండా ఆ గుడ్లు నా కంటపడ్డాయి. ఈ గుడ్లను చూడటం ఇది రెండవసారి.

మొదటిసారి ఈ గుడ్లను చూసినప్పుడు ఆశ్చర్యంతో పాటు కొంచెం భయం కూడా వేసింది. నేను ఒక పొద వెనక నక్కాను. నా తమ్ముడు కూడా నా పక్కన చేరాడు. మేం చూస్తుండగా పొడవాటి పసుపు కాళ్లు ఉన్న పిట్ట నడుచుకుంటూ వచ్చి గుడ్లమీద కూర్చుంది. “అది ఎర్రజుత్తు తీతువ,” గుసగుసగా చెప్పాడు తమ్ముడు.

“అడవిలో ఇటువంటివే గుడ్లను చూశాను...”

“ఇటువంటివేనా?!” తీతువ నా మాటకి అడ్డుపడింది.

“నువ్వు ఏం చెప్పదలుచుకున్నావు?”

“ఈ గుడ్లు నావి. నేను ఎర్ర తీతువని కాను,” అని బదులిచ్చింది.

“అవును, నువ్వు ఎర్ర తీతువవి కాదు! అయితే, ఆగు. ఈ గుడ్లు నీవి ఎలా అవుతాయి? దొంగా!”





“నన్ను దొంగ అనటానికి నీకు ఎంత ధైర్యం! రుజువు చెయ్యి!” అరిచింది పిట్ట.

“ఏం రుజువు చెయ్యాలి?”

“ఈ గుడ్లు నావి కావని రుజువు చెయ్యి చూద్దాం.”

“కానీ ఎలా?”

“ఎవరిమీదైనా ఆరోపణ చేసేటప్పుడు అన్నీ ఖచ్చితంగా తెలుసుకోవాలి బిడ్డా! పో, పోయి ఏదో ఆలోచన చెయ్యి.”

“సరే. వెళ్లి దాంట్లోంచి ఒక గుడ్డు తీసుకువస్తాను. అప్పుడు నువ్వే చూడు...”

“అటువంటిది ఏమీ నువ్వు చెయ్యబోవటం లేదు,” పిట్ట బెదిరించింది. “నీది కాని దానిని తీసుకునే హక్కు నీకు ఎవరు ఇచ్చారు?”

ఈ సమస్యలో చిక్కుకున్నందుకు నన్ను నేను తిట్టుకున్నాను.

“చూడు పిట్టా!” నేను చెప్పాను. “అడవిలో గుడ్లను కానీ ఈ గుడ్లను కానీ తాకనని మాట ఇస్తున్నాను. అయితే, చిక్కుముడి విప్పుతాను. నేను మళ్లీ వచ్చేవరకు నువ్వు ఇక్కడే ఉండు.”





నేను అడవికి తిరిగి వెళ్లాను.

అది పట్టణ ప్రాంతంలోని అడవి: చాలా పెద్ద విస్తీర్ణంలో ప్రకృతిని కాపాడుతున్నారు. పట్టణం మధ్యలో ఉన్న అడవి కాబట్టి, ఇక్కడ ప్రమాదకరమైన జంతువులేమీ లేవు. సేదతీరడానికి, నడవటానికి, వ్యాయామం చెయ్యడానికి ప్రజలు ఇక్కడికి వస్తారు. అడవిలో ఒక చిన్న చెరువు, దాని పక్కన తోట ఉన్నాయి. వానాకాలం వెళ్లిపోయిన తరవాత చెరువులో నీళ్లు తగ్గిపోతాయి. శీతాకాలం ముగిసేనాటికి చెట్లు ఆకులు రాలుస్తాయి, అడవి పలచగా అనిపిస్తుంది. ఇది వేసవి ఆరంభం. అన్వేషణకు ఇది సరయిన సమయం. గత వారం అన్వేషణలో మాకు ఈ గుడ్లు కనిపించాయి.

గుడ్లు ఒక వైపు కొంచెం కోసుగా, మరో వైపు గుండ్రంగా ఉన్నాయి. పువ్వులో రేకులమాదిరి గుడ్లు గూటిలో అమర్చి ఉన్నాయి – కోసుగా ఉన్న వైపు మధ్యలోకి ఉండి, గుండ్రంగా ఉన్న వైపు బయటికి ఉన్నాయి. పెంకు అంతటా మచ్చలు, మరకలు ఉన్నాయి. గుండ్రంగా ఉన్న వైపు నలుపు, లేత గోధుమ రంగు మచ్చలు పెద్దగా ఉన్నాయి.

ఒక పుల్ల తీసుకుని గుడ్లు ఎంత పొడవు ఉన్నాయో కొలిశాను. తరవాత ఫోరెన్సిక్ నిపుణురాలిగా అన్ని కోణాలనుంచి గుడ్ల ఫోటోలు తీశాను. “నా వాదన నిరూపించటానికి ఇప్పుడు అన్ని ఆధారాలూ ఉన్నాయి,” అనుకుంటూ నేను మైదానానికి తిరిగి వెళ్లాను.





ఇంతకు ముందు గుడ్లు చూసిన చోటుకి వచ్చానని అనుకున్నాను. కానీ, ఎంత చూసినా గుడ్లు కనపడలేదు.

“చిత్రంగా ఉందే!” బుర్ర గోక్కుంటూ పైకి అన్నాను.

చెరువు దగ్గర నీటికీ, చెట్లకీ మధ్య సన్నటి భూభాగమే ఉంది కాబట్టి గూడు కనుక్కోవటం కష్టం కాలేదు. అంతేకాకుండా, వెదురు పొద పక్కన చిన్న పుట్టమీద అది ఉండటంతో అక్కడికి వెళ్లటం తేలిక అయ్యింది. ఈ పెద్ద మైదానంలో ఇందాక చూసిన గూడు ఎక్కడుందో తెలియటం లేదు.

“గుడ్లకోసం చూస్తున్నావా, బిడ్డా?” నా పక్కనే నిలబడి నవ్వుతూ అడిగింది తీతువ.

“భలే ఉందే, ఇప్పటిదాకా నిన్ను గమనించనే లేదు!” నేను అన్నాను.

“గుడ్లు కూడా కనపడి ఉండవులే.”

“అవును. ఎక్కడున్నాయి అవి?”

“నీ కళ్లకిందే ఉన్నాయి! ఇక్కడ చూడు!”





నమ్మశక్యం కాకుండా ఉంది! గుడ్లు నా ముందే ఉన్నాయి, అయినా అవి నా కంట పడలేదు. మా టీచరు ఊసరవెల్లి గురించి చెపుతున్నప్పుడు పరిసరాల్లో కలిసిపోయిన ఊసరవెల్లిని ఊహించుకోటానికి ప్రయత్నించాను. పరిసరాల్లో కలిసిపోయిన దానికి ఇప్పుడు ఒక మంచి అనుభవం, ఉదాహరణ నాకు ఎదురయ్యాయి.

నా కళ్లు బైర్లు కమ్మినట్టు అయ్యాయి. మామూలుగా అవ్వటానికి కొంత సమయం పట్టింది. కొలతగా ఉపయోగించిన పుల్లను జేబులో నుంచి బయటకు తీసి ఒక గుడ్డు పక్కన ఉంచాను. మరింత ఆశ్చర్యం, గందరగోళం నన్ను కమ్ముకున్నాయి.

“ఆ గుడ్ల కంటే ఇవి చిన్నగా ఉన్నాయి,” నా స్వరం చాలా తక్కువ

స్థాయిలో ఉంది. గుడ్లను కళ్లప్పగించి చూస్తుండిపోయాను. ఆ తరవాత నా కెమెరాలోని బొమ్మలను చూస్తుండిపోయాను. ఈ రెండు చోట్ల ఉన్న గుడ్లను ఎలా పోల్చాలో తెలియలేదు. ఉన్నట్టుండి ఒక ఆలోచన తట్టింది. “పక్షులకు ఉండే జుత్తు ఏమిటో చెప్పగలవా?” నేను అడిగాను.

“తప్పకుండా చెబుతాను,” పిట్ట బదులిచ్చింది. “కొన్ని పక్షులలో ముక్కుకింద, పైన మెరిసే రంగులలో ఉండే చర్మాన్నే జుత్తు అంటారు. ఉదాహరణకు కోడిలో ఈ జుత్తు ముడతలు పడి ఉంటుంది.”

“అయితే నువ్వు పసుపు జుత్తు తీతువవి. ఇవి నీ గుడ్లు!” నేను ఉత్సాహంగా అరిచాను.





“రెండు విషయాలూ సరిగ్గా చెప్పావు! మాకూ, ఎర్రజుత్తు తీతువకీ మధ్య తేడాలను గమనించగలిగినందుకు సంతోషంగా ఉంది. మేం కొంచెం చిన్నగా ఉంటాం. మా రెండింటి గుడ్ల మధ్య పోలికలు ఉంటాయి కానీ ఒకేలాగా ఉండవు.

“తీతువలు గూళ్లు ఎందుకు కట్టుకోవో నాకు అర్ధం కాదు. మీ గుడ్లు, పిల్లలు గూటిలో భద్రంగా ఉంటాయి కదా?”

“యుగంధర్ లాగా మంచి పరిశోధకురాలివి అని అనుకుంటున్న సమయంలో పప్పులో కాలేశావు,” పిట్ట ముఖంలో నిరాశ స్పష్టంగా వ్యక్తమవుతోంది. “చూడటమే కానీ నీలో పరిశీలన లేదు,” అంటూ

చురక వేసి ఎగిరిపోయింది.

ఆ అవమానాన్ని దిగమింగి అక్కడే నిలబడ్డాను. గాలిలో ఒక చక్కర్ కొట్టి పిట్ట తిరిగి నా పక్కన వాలింది. “మళ్లీ నా గుడ్లను చూడు. దాని చుట్టూ ఏం కనపడుతోంది?” అని ఆజ్ఞతో కూడిన ప్రశ్న వేసింది పిట్ట.

నేను దేనిని గమనించాలని పిట్ట అనుకుంటోందో నాకు తెలియలేదు.

“నాకా... ఏం కనపడుతోందా... రాళ్లు, పుల్లలు... ఆగు! చాలా రాళ్లు... వీటిని ఇక్కడ పేర్చినట్లు ఉందే?” పిట్ట వంక నేను ప్రశ్నార్థకంగా చూశాను.





“అవును,” బదులిచ్చింది పిట్ట. “నువ్వు చూస్తున్నది మా గూడుని. దానిని మేం అలా కడతాం. ఇలాంటి గూళ్లు కట్టే ఇతర పక్షులు ఉన్నాయి. ఎర్ర తీతువ కట్టిన గూటిని నువ్వు ఇప్పటికే చూశావు ...”

పక్షి చెబుతున్నది విని నాకు ఆశ్చర్యం వేసింది. “గూడా? దీనిని గూడు అంటారా!”

“ఏం గూళ్లంటే చెట్టులోనే కట్టుకోవాలని ఉందా? ఇంతకీ గూడు అంటే నువ్వు ఏం అనుకుంటున్నావు?” పిట్ట అడిగింది.

“గూడు అంటే... గుడ్లను పట్టి ఉంచేది!”

“అంతేకాదు, గుడ్లకు, పిల్లలకు రక్షణ కావాలి. మా గూళ్లను కనుక్కోవటం కష్టం కాబట్టి గుడ్లకు రక్షణ లభిస్తుంది. అంతెందుకు, నువ్వు కూడా మా గూడును కనుక్కోలేకపోయావు కదా!”

ఆ తరవాత తాము గూళ్లను ఎలా కడతాయొ పసుపుపచ్చ తీతువ నాకు ఒక ‘క్లాసు’ తీసుకుంది.

ముందుగా వాటి శరీరంతో నేలలో చిన్న గుంతను ఒకదానిని చేస్తాయి. ఆ తరవాత పరిసరాలతో కలిసిపోయే రాళ్లు, మట్టిపెళ్లలు, పుల్లలు, గడ్డి వంటి వాటిని తీసుకుని గుంతచుట్టూ అమరుస్తాయి. తమ గూటికి స్థలాన్ని ఎంచుకోవటంలో అవి ఎంతో జాగ్రత్త వహిస్తాయి. ఆ ప్రదేశం





సహజంగానే గూడును కనపడకుండా చేసేదిగా ఉండాలి. “మా గుడ్లు మెరిసే రంగులో ఉండవు. చుట్టపక్కల ఉన్న రాళ్లమాదిరిగానే అవి కూడా ఉంటాయి,” పిట్ట చెప్పింది.

నేను అప్పటికే రెండు గూళ్లను చూసి ఉన్నాను. గూడు తయారు చెయ్యటానికి రాళ్లనీ, పుల్లలనీ ఈ పిట్టలు పేర్చాయని నాకు అనిపించలేదు.

అయినాకానీ, నాకు ఎందుకనో ఆ గూడు నచ్చలేదు. “నీ గుడ్లు కనపడకుండా ఉండటానికి నీ గూడు పనికివస్తుందేమో, కానీ నీ పిల్లల సంగతి ఏమిటి? నీ గుడ్లు పొదిగినప్పుడు ఏమవుతుంది?”

“గుడ్లు పొదిగిన తరవాత మాకిక గూడుతో పనిలేదు!” అంటూ తుర్రుమని ఎగిరిపోయింది తీతువ!

***

దక్షిణ ఢిల్లీలోని అటవీప్రాంతంలో సంజయ్ వన్‌లో 2010 మే - ఆగస్టు నెలల మధ్య పరిశీలనల ఆధారంగా రాసిన కథ.

పక్షుల, గూళ్ల వాస్తవ పరిణామాన్ని ఈ పుస్తకంలోని ఫోటోలు చూపకపోవచ్చు.





పసుపు జుత్తు తీతువ



పసుపు తీతువ గూడు



గడ్డిమధ్య పసుపు తీతువ గూడు



గుడ్లను పొదుగుతున్న పసుపు తీతువ



ఎర్ర జుత్తు తీతువ



ఎర్ర తీతువ గూడు



గడ్డిమధ్య ఎర్ర తీతువ గూడు



గుడ్లను పొదుగుతున్న ఎర్ర తీతువ

MYSTERY OF THE FOUR EGGS published by VIDYA ONLINE is licensed under a Creative Commons Attribution-NonCommercial-ShareAlike 3.0 Unported License (http://creativecommons.org/licenses/by-nc-sa/3.0/)
Permissions beyond the scope of this license may be available at admin@vidyaonline.org

http://vidyaonline.net